10 శాతం రాయితీతో అద్దె బస్సులు

రాయదుర్గం: వివిధ కార్యక్రమాలకు అతి తక్కువ ధరలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వడానికి ఏర్పాట్లు చేసినట్లు హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం. మురళీధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపోలోని సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను అందుబాటులో ఉంచామని, బుక్ చేసుకున్న వారికి ఫీజులో 10శాతం రాయితీ సౌకర్యాన్ని కూడా కల్పిస్తామన్నారు. ముఖ్యంగా కుటుంబంలో నిర్వహించే వివాహాది శుభకార్యాలు, విద్యాసంస్థలు, కాలనీ, బస్తీవాసులు సామూహికంగా నిర్వహించే విహార యాత్రలు, పిక్నిక్‌లకు అతి తక్కువ ధరలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మరిన్ని వివరాలకు 9948082462, 7382806662, 7382814700, 7382806690లలో సంప్రదించాలని ఆయన కోరారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

చందానగర్: చందానగర్‌లోని విశాఖ శ్రీ శారద పీఠపరిపాలిత లక్ష్మీగణపతి ఆలయంలో శివపార్వతుల కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా కోటి కుంకుమార్చనలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు శాలువాతో సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు నాసర్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్, అవార్డుల ప్రదానం

రాయదుర్గం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని నాసర్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్, అకాడమిక్ అవార్డుల ప్రదానోత్సవం 15వ తేదీన నిర్వహిస్తారు. పాఠశాలలో అకడమిక్‌గా అత్యుత్తమ మార్కులు సాధించినవారికి, ఫుల్ అటెండెన్స్ ఉన్న వారికి అవార్డులను ప్రదానం చేస్తారు. దీంతోపాటు పాఠశాలలో ఇన్వెస్టిచర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన విద్యార్థులు ఎన్నుకున్న ప్రతినిధులకోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైంది



రాయదుర్గం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా పేర్కొన్నారు. ఖాజాగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను ఆయన మంగళవారం పాఠశాల ఆవరణలో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడికి బదిలీ, పదోన్నతి తప్పనిసరిగా వస్తుందని, ఎక్కడ పనిచేసినా చిత్తశుద్ధితో విధులను నిర్వహించేవారికి ఎక్కడైనా గుర్తింపు వస్తుందన్నారు. బదిలీపై వెళ్లిన వెంకట్‌రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామ్‌రెడ్డి, ఎంఏహమీద్, రాంచందర్, శ్రీలత, జ్యోతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజశేఖర్‌రెడ్డి, ఏఏపీసీ చైర్మన్ వీణ, రాంభూపాల్‌రెడ్డి, మాణిక్యం, జ్యోష్ణ, పేనమ్మ, సయ్యద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించండి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండలం బీరంగూడ, కిష్టారెడ్డిపేట, అమీన్‌పూర్ తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను కాపాడాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చి వేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆపార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ పార్టీ మండల కార్యదర్శి జార్జ్ మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ భూములు, అసైన్‌మెంట్ భూములు, చెరువులు, కుంటలు, కాలువలు, దేవాదాయ భూములు శ్మశాన వాటికలు కబ్జాకు గురవుతున్నాయన్నారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములేవీ కూడా ఆక్రమణదారులు విడిచి పెట్టడం లేదన్నారు. అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కబ్జాదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహారెడ్డి శ్రీనివాస్ రెడ్డి వీరస్వామి పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరేయాలి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల చౌరస్తా నుంచి మర్రిచెట్టు సర్కిల్ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రతి ఇంటిపై జెండాను ఎగరవేసి తమ దేశ భక్తిని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు సి. బీరప్ప, జిల్లా బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి అనిత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇందిర, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.సిద్ధప్ప, కౌన్సిలర్‌లు శ్వేతరవికాంత్ రెడ్డి, వందననగేష్, కోఆప్షన్ సభ్యురాలు జె.లక్ష్మీరాములు, నాయకులు వీణ, లతా, భువనేశ్వరి, గౌరీ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలో స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఇంటింటికి జాతీయ జెండాలను కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 5న ప్రతి ఇంటిపై జెండాను ఆవిష్కరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బండి నోరోత్తం రెడ్డి, భవానిదాస్, నరసింహ, వెంకటరమణ, మధుసూధన్ రెడ్డి పాల్గొన్నారు.


ఖాజాగూడలోని మోడల్ శ్మశానవాటిక ప్రధాన గేటు


ఖాజాగూడలో మోడల్ శ్మశానవాటిక స్థలంలో పేరుకుపోయిన చెత్త

మోడల్ గ్రేవ్‌యార్డ్!

గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో 'మోడల్ గ్రేవ్‌యార్డ్' పేరుతో హడావుడిగా శంకుస్థాపన పనులు ప్రారంభించిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు ఈ స్థలంవైపు అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా కన్నెత్తి చూడకపోవడం విడ్డూరం. ఖాజాగూడలో మోడల్ గ్రేవ్ యార్డ్‌కు శంకుస్థాపన చేసి ఏడాది గడిచినా ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభించలేదు. శంకుస్థాపన తర్వాత మళ్లీ ఇటువైపు ఎవరూ కన్నెత్తి చూడకపోవడం మరీ విడ్డూరం. 2023 మే19న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. దీన్ని త్వరితగతిన అందుబాటులో తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను అప్పట్లో ఎమ్మెల్యే ఆదేశించారు. ఆ తర్వాత ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టకపోవడం పనులలో పురోగతి లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – రాయదుర్గం



ఉత్సాహంగా ఇన్వెస్టిచర్ వేడుకలు


విద్యార్థులతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరితాపునియా, ఉపాధ్యాయులు

రాయదుర్గం: నేటి విద్యార్థులు రేపటి నిజమైన నాయకులుగా మారాలని హెచ్‌సీయూ కేంద్రీయ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరితాపునియా పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ కేంద్రీయ విద్యాలయలో ఇన్వెస్టిచర్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కష్టపడి పనిచేయడం ద్వారా సమాజం, విద్యార్థులు ప్రతి పనిని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఆటలు, కళలు, వ్యాసరచన, సాంస్కృతిక కార్యక్రమాలలో పోటీ పడుతూ ముందుకుసాగాలన్నారు. అంతకుముందు ఇన్వెస్టిచర్ మార్చ్‌ఫాస్ట్‌ను నిర్వహించారు. స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్లు, క్రీడా, కోకరిక్యులర్, స్కూల్ క్రమశిక్షణా కమిటీ, హౌజ్ కెప్టెన్లు స్కూల్ జెండాలను చేతబూని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీసీఏ ఇన్‌చార్జి జ్యోతి, పీఈటీ విజయభాస్కర్‌రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

రాయదుర్గం: వైభవ మహాలక్ష్మీ మహా నిలయం రాయదుర్గంలో మూడు రోజుల పాటు నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. విద్యా ఉపాసకులు జాడ జగదీష్ శర్మ ఆధ్వర్యంలో నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ కృష్ణాగౌడ్, భరత్‌కుమార్, సతీష్‌కుమార్ శ్రీరామ్ పర్యవేక్షణలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. లక్ష్మీ గణపతిపూజ, పుణ్యాహవాచన, రక్షాధారణ, రుత్విక్‌వరుణ, అఖండ దీపారాధన, అంకురారోపణ, యాగశాల ప్రవేశం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం మండల మండప పునఃపూజ, శకల దేవతాశక్తి మంత్రోక్తహోమాలు, భేరి మూర్తులకు ధాన్యాధివాసం. వేదస్వస్తి తీర్థ ప్రసాద వితరణ చేస్తారు. గురువారం ఉదయం 6.51 గంటలకు వైభవ మహాలక్ష్మీ దేవి ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహిస్తారు.

ఎఫ్ఆర్ఎస్‌బీ ఫెలోగా ప్రొ. రవికుమార్‌గుట్టి



రాయదుర్గం: హెచ్‌సీయూ ప్రొఫెసర్ రవికుమార్ గుట్టి రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీకి ఫెలోగా నియామకమయ్యారు.హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్(ఎస్ఎల్ఎస్) బయో కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్‌గా ఆయన పనిచేస్తున్నారు. రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ అనేది జీవశాస్త్రం కోసం ఒకే ఏకీకృత స్వరం, ఇది ప్రభుత్వానికి సలహిస్తూ విధానాలను ప్రభావితం చేస్తుంది. విద్యా, వృత్తిపరమైన అభివృద్ధి చేస్తుందన్నారు. సభ్యులకు మద్దతు ఇవ్వడంతోపాటు జీవిత శాస్త్రాలలో ప్రజల ఆసక్తిని ప్రోత్సహిస్తుందన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్‌లో ఉన్న రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ యొక్క ఫెలోషిప్ జీవశాస్త్ర పరిశోధన, బోధన లేదా జీవశాస్త్రంపై పట్టు ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు. ఈ సందర్భంగా అందించే ఫెలోషిప్ అనేది ఆర్ఎస్‌బీ సభ్యత్వం యొక్క అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గ్రేడ్, జీవశాస్త్రాల పురోగతికి విలక్షణమైన, గుర్తించదగిన సహకారాన్ని ప్రదర్శించిన దరఖాస్తుదారులకు సభ్యత్వ ఎన్నికల తర్వాత ఇవ్వబడుతుంది.ఈ సందర్భంగా ప్రొఫెసర్ రవికుమార్ మాట్లాడుతూ.. రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీకి ఫెలోగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు.

నేడు స్వచ్ఛంద బంద్‌కు పిలుపు

పటాన్‌చెరు టౌన్: బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న హింసకాండకు నిరసనగా పటాన్‌చెరు 113 డివిజన్ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని రామమందిర్ దేవస్థానంలో హిందూ ఐక్యవేదిక నిర్వహించిన కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు, వర్తక సంఘం సభ్యులు, విద్యార్థి సంఘాలు, తదితరులతో సమావేశమయ్యారు.ఇందులో బంద్‌ను శాంతియుత వాతావరణంలో కొనసాగాలించాలన్నారు. ప్రతీఒక్కరూ సహకరించాలన్నారు. ఉదయం 8.30 గంటలకు రామమందిర్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతోందన్నారు.

చందానగర్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన బ్రాంచ్ ప్రారంభం


బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న సంజయ్ వినాయక్ ముదలియార్

చందానగర్: బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన ఫిజిటల్ బ్రాంచ్‌ను చందానగర్‌లో మంగళవారం బ్యాంక్ ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ వినాయక్ ముదలియార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ ఆఫ్ బరోడా మొట్టమొదటి ఫిజిటల్ బ్రాంచ్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఫిజిటల్ బ్రాంచ్ తమ కస్టమర్‌లకు బ్యాంకింగ్ లావాదేవీలను రోజులో ఏ సమయంలోనైనా ఇబ్బంది లేని పద్ధతిలో పూర్తి చేసే స్వేచ్ఛను ఇస్తుందన్నారు. దేశవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టుగా 7 ఫిజిటల్ శాఖలను ప్రారంభించాలని బ్యాంక్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 117వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జూలై 20న ముంబైలోని హార్నిమాన్ సర్కిల్‌లో మొదటి ఫిజిటల్ శాఖను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జోన్ జోనల్ హెడ్, జనరల్ మేనేజర్ రితేష్ కుమార్, సీనియర్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌లు, జోన్, రిజియన్ సిబ్బంది పాల్గొన్నారు.

జలమండలి ఎండీని కలిసిన కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేశ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్‌ల కోసం రూ.5.50 కోట్లలతో ప్రతిపాదనలు చేశామన్నారు. ఈ విషయంపై కొద్ది రోజుల క్రితంమంత్రి దామోదరను కలిశామన్నారు. దీనిపైనే జలమండలి ఎండీ అశోక్ రెడ్డిను కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. వెంటనే 50 శాతం నిధులను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు మవీన్ గౌడ్, పీటర్‌లు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్, పాఠశాలకు పొజిషన్ చూపించండి


స్థలాన్ని పరిశీలిస్తున్న అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మండల తహసీల్దార్ రాధా పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత ప్రాతిపదికన భవనాలు నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వ స్థలాలను కేటాయించిందన్నారు. ఇందులో భాగంగా పాఠశాల, పోలీస్‌స్టేషన్‌ల నిర్మాణాలకు పొజిషన్ చూపాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు చౌటకూరి బాల్ రెడ్డి, కౌన్సిలర్ కృష్ణ, కల్పన ఉపేందర్ రెడ్డి, కొల్లూరు మల్లేశ్, కో-ఆప్షన్ సభ్యులు తలారి రాములు, సీనియర్ నాయకులు కొల్లూరు యాదగిరి, చౌటకూరి మహిపాల్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శిగా రాజేందర్

పటాన్‌చెరు టౌన్: నందిగామ గ్రామ కార్యదర్శిగా రాజేందర్ బాధ్యత స్వీకరించారు. పటాన్‌చెరు మండలం నందిగామకు చెందిన కార్యదర్శి రిజ్వాన్ బదిలీపై హత్నూర మండలం చందాపూర్‌కు వెళ్లారు. ఆ స్థానంలో చందాపూర్ పంచాయతీకి చెందిన రాజేందర్ పాటిల్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు.

సీసీ రోడ్లకు క్యూరింగ్ చేసి అందుబాటులోకి తేవాలి



ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్లకు క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో రూ.40 లక్షల నిధులతో పూర్తైన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేయాలని సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణం చేయించినందుకు కార్పొరేటర్‌ను కాలనీ వాసులు సన్మానించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, పోశెట్టి గౌడ్, యాదగిరి, అగ్రవాసు, సంగమేష్, రవీందర్, అజామ్, బుజమ్మ, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

పటాన్‌చెరు టౌన్: ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ రాంబాబును హైదరాబాద్‌లో మంగళవారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడకు చెందిన సువిన్ ఫార్మా కార్మికులు కలిశారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. 15 – 20 ఏళ్లుగా పాశమైలారం పారిశ్రామికవాడలోని సువిన్ ఫార్మా కంపెనీలో పని చేస్తున్నామన్నారు. హక్కుల సాధన కోసం యూనియన్ ఏర్పాటు చేసుకుంటే అప్పటి నుంచి పరిశ్రమ యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపారు. అయితే ఈనెల 3 నుంచి పరిశ్రమ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా యజమాని మాత్రం స్పందించడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన్ను కోరారు. కార్యక్రమంలో సువిన్ ఫార్మా కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు


ఊరేగింపులో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: బాపూనగర్‌లోని పోచమ్మ ఆలయం ఫలహార బండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయం నుంచి హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ..ప్రతియేటా బోనాలు, ఫలహారబండి ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా జరుపు కుంటారన్నారు. అందరూ కలిసికట్టుగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. అనంతరం పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల సందడి, యువకుల నృత్యాలతో ఊరేగింపు ఘనంగా సాగింది. ఈ కార్య క్రమంలో చందానగర్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి, ఎస్ఐ రఘు, బాపునగర్ రాజ్‌కుమార్, గోపాల్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, రవీందర్, మహేష్‌చారి, రాజు, ప్రభాకర్, కృష్ణ, ప్రవీణ్, వెంకటేష్, దుర్గేష్, సుభాష్ పాల్గొన్నారు.

పాత్రికేయుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న జగదీశ్వర్ గౌడ్

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గ పాత్రికేయుల అభ్యున్నతికి ప్రభుత్వం ద్వారా కృషి చేసే బాధ్యత తీసుకుంటామని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తాలోని వీఆర్ అశోక్ గ్రాండ్ హోటల్‌లో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొండాపూర్, చందానగర్ డివిజన్ల కార్పొరేటర్లు హమీద్ పటేల్, మంజుల రఘునాథ్‌రెడ్డితో పాటు జగదీశ్వర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని ప్రభావితం చేయగలిగే శక్తి ఒక్క పాత్రికేయులకే ఉంటుందన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు సలీం, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్, ప్రెస్ క్లబ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలి


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

రాయదుర్గం: రక్తానికి ప్రత్యామ్నాయం లేదని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ భవానిశ్రీ పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ఫీనిక్స్ అక్విలా(టవర్‌బి)లో ఫీనిక్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌తో కలిసి వ్యవస్థాపకుడు చుక్కపల్లి శంకర్‌రావు స్మారకార్థం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తం చాలా ముఖ్యమైనదని, దాన్ని ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయడానికి స్వచ్ఛందగా ముందుకు రావాలని ఆమె సూచించారు. రక్తాన్ని దానంగా స్వీకరించి అవసరమైన వారి వినియోగించేలా చేయడంలో ఫీనిక్స్ ఫౌండేషన్ కృషిని ఆమె అభినందించారు. సైబరాబాద్ జాయింట్ సీపీ(ట్రాఫిక్) డి జోయెల్‌డేవిస్, ఫీనిక్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గోపికృష్ణ, గ్రూప్ డైరెక్టర్ శ్రీకాంత్‌బాడిగ, బ్లడ్‌బ్యాంక్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్, డైరెక్టర్ అవినాష్‌చుక్కపల్లి, మధుమతిచుక్కపల్లి, పాటిబండ అపర్ణ, ఆకాశ్ చుక్కపల్లి, పలువురుసంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ దివ్యవాణి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సుల్తాన్‌పూర్ పల్లె దవాఖానా వైద్యాధికారి దివ్యవాణి అన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి సంకల్ప్ కింద 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం అమీన్‌పూర్ మండల పరిధిలో ఉన్న సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అవగాహన కల్పించారు. విద్యార్థులకు షీ- టీమ్, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆన్‌లైన్ భద్రత, లింగ సమానత్వం, లింగ వివక్షత, సఖీ సర్వీసెస్, చైల్డ్ లైన్ సేవలు, సైబర్ నేరాలు, పిల్లల అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల నివారణ, ఆరోగ్యం, పోషకాహారం, హెల్ప్ లైన్ నంబర్లు (1098, 100, 181, 112, 1930) గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి, షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ శివ కుమార్, గ్రామ పంచాయతీ సెక్రటరీ మాణిక్యం, స్కూల్ హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు, ఆశ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి

కేపీహెచ్‌బీకాలనీ: క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రాహుల్‌నాయక్, చంద్రశేఖర్‌పటేల్, రంజిత్‌యాదవ్, ఆశృత్, అనీష్‌గౌడ్, రోహిత్, కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.